క్లుప్తంగా

గురుకులం విద్యార్థినుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ వాణీకుమారి

రాజమహేంద్రవరం రూరల్: సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ నిర్వహించిన నేషనల్ లెవల్ టాలెంట్ సెర్చ్ కాంపిటేషన్ 2023–24లో బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు ప్రతిభను చాటారని ప్రిన్సిపాల్ ఏ.వాణీకుమారి తెలిపారు. కళారంగ్ అవార్డు విజేతలుగా 8వ తరగతి విద్యార్థిని బి.పూజిత (డ్రాయింగ్ అండ్ పెయింటింగ్), 10వ తరగతి విద్యార్థిని ఎస్.భవాని, ఆరో తరగతి విద్యార్థిని పి.వర్షిత (హ్యాండ్ రైటింగ్) బంగారు పతకాలు సాధించారు. అలాగే పోటీలో పాల్గొన్న 85 మంది విద్యార్థినులు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు సాధించారు.

ఉపాధి కల్పనకు ముందుకు రావాలి



మాట్లాడుతున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో విశేష సేవలు అందిస్తున్న రోటరీ సంస్థ.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ముందుకు రావాలని జీఎస్ఎల్ కాలేజ్ చైర్మన్ గన్ని భాస్కరరావు అన్నారు. ఆదివారం హోటల్ లా హాస్పిన్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా ఆధ్వర్యంలో రోటరీ బిజినెస్ ఫెలోషిప్ పేరుతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కరరావు మాట్లాడుతూ స్థానికంగా వనరులను అందిపుచ్చుకుని, సమాజంలో యువతకు ఉపాధి కల్పించేందుకు నూతన ఆవిష్కరణలకు సిద్ధం కావాలన్నారు. అధ్యక్షుడు తీగెల రాజా మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు.

ఉపాధ్యాయులకు గురుస్పందన పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు సతీష్ బాబు

కంబాలచెరువు: ఏలూరులో ఆదివారం జరిగిన గురుస్పందన కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఆ వివరాలను జిల్లా స్పందన ఈదా ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.సతీష్ బాబు తెలిపారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, ఏలూరు జిల్లా డీఈవో శ్యామ్ సుందర్ చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారన్నారు. జిల్లాలోని వెదుళ్లపల్లి పాఠశాలకు చెందిన కె.ఝాన్సీ, హుకుంపేటకు చెందిన జి.జ్యోతి, సీతానగరానికి చెందిన కె.నాగేశ్వరరావు, రాజమహేంద్రవరానికి చెందిన ఐ.రాజ్ కుమార్, కడియానికి చెందిన ప్రేమ్ చంద్, సువర్ణ పురస్కారాలు అందుకున్నారన్నారు. ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, సమాజంలో గురువులపై తమకున్న గౌరవ భావాన్ని చాటి చెప్పారన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో తీవ్రగాయాలతో లక్ష్మీబాబు


కడియం: కొబ్బరి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ వెనుక చక్రాలు కాలిపై ఎక్కి తీవ్ర గాయాలు కావడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. జాతీయ రహదారిపై వేమగిరితోట వద్ద ఆదివారం ఈ ఘటన జరిగింది. కడియం పోలీసుల కథనం ప్రకారం.. బుర్రిలంక గ్రామానికి చెందిన పీతా లక్ష్మీబాబు (29) నర్సరీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. అతడు ఆదివారం మైటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. వేమగిరితోట వద్దకు వచ్చేసరికి పక్కనే వెళుతున్న మరో మోటార్ సైకిల్ హ్యాండిల్ తగిలి జాతీయ రహదారిపై పడిపోయాడు. అదే సమయంలో కొబ్బరి లోడుతో వస్తున్న ట్రాక్టర్ వెనుక చక్రాలు లక్ష్మీబాబు ఎడమ కాలిపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స కోసం 108లో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కడియం ఎస్సై హష్యక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నిరంతర నిఘా

- కార్పొరేషన్‌లో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఉద్యోగుల పర్యవేక్షణ
- సమస్య ఏర్పడితే తక్షణమే స్పందించే అవకాశం



సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్



కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఏమూల ఏమి జరిగినా చిటికెలో నగర పాలక సంస్థకు తెలిసిపోతుంది. ఇందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ పేరుతో నిఘా వ్యవస్థ ఏర్పాటైంది. దీనిలో కమిషనర్ కాన్ఫరెన్స్ రూమ్ సిద్ధం చేశారు. వీటి నిర్మాణానికి రూ.4.06 కోట్లు ఖర్చయ్యింది. నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారులు, పారిశుధ్య సేకరణ కేంద్రాలు, పారిశుధ్య వాహనాలు నడిచే మార్గాలనే రికార్డు చేసేలా అత్యాధునిక సీసీ కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేశారు. నిత్యం 15 మంది సిబ్బంది నగర పరిస్థితిని పర్యవేక్షించేలా

8 రకాల విధులు

- సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షణ
- నగర పాలక సంస్థ హెల్ప్ లైన్
- సోషల్ మీడియా మేనేజ్‌మెంట్
- పారిశుధ్య వెహికల్ ట్రాకింగ్
- ఉద్యోగుల పనితీరుపై పర్యవేక్షణ
- ఫిర్యాదుల స్వీకరణ, రిజిస్ట్రేషన్
- సిస్టమ్ డిజిటలైజేషన్
- పారిశుధ్య పాయింట్లపై పర్యవేక్షణ

కంట్రోల్ రూమ్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో సిద్ధం చేశారు. ప్రస్తుతం ఎనిమిది రకాల పనులను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు దీనిద్వారా నిర్వహించేలా రూపొందించారు.

ఇతరులకు ప్రవేశం లేదు

కమాండ్ కంట్రోల్ రూమ్‌లోకి సంబంధిత అధికారులు, సిబ్బందికి మాత్రమే ప్రవేశం కల్పించారు. లాక్ సిస్టం కాకుండా ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం ఏర్పాటు చేశారు. కమిషనర్‌తో పాటు కొద్దిమంది



పనిచేస్తున్న సిబ్బంది

అధికారులు, సిబ్బందికి మాత్రమే కంట్రోల్ రూమ్‌లోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

300 అంగుళాల ఎల్ఈడీ డిస్‌ప్లే

దేశ వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో మొట్టమొదటి సారిగా 300 అంగుళాల డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. ఫుల్ డిజిటల్ క్వాలిటీ ఇచ్చే ఆధునిక టెక్నాలజీ వినియోగించారు.

నగరంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 172 ప్రదేశాలలో 172 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షించే సిబ్బంది నగరంలో ఉత్పన్నమయ్యే సమస్యలను సీసీ కెమెరాలలో చూసి సంబంధిత అధికారులకు, అదే సమయంలో కమిషనర్‌కు సమాచారం అందించే విధంగా ఏర్పాటు చేశారు. సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించేందుకు ఈ నిఘా దోహదపడుతుంది.

పలు విభాగాల నుంచి సిబ్బంది ఎంపిక

నగర పాలక సంస్థలో పలు విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించేందుకు ఎంపిక చేశారు. సాంకేతిక పరమైన అనుభవం, చురుకుదనం ఉన్న ఉద్యోగులను గుర్తించిన కమిషనర్ దినేష్‌కుమార్.. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పనిచేసేందుకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేశారు.

సమర్థంగా విధులు



నగరంలో ఎక్కడ ఏమి జరిగినా పర్యవేక్షించే విధంగా నిఘా వ్యవస్థ సిద్ధం చేశాం. పనులు సమర్థవంతంగా చేసేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుంది. రూ.4.06 కోట్లతో కమాండ్ కంట్రోల్ రూమ్, కాన్ఫరెన్స్ హాలు సిద్ధం చేశాం. మరింత సాంకేతిక ప్రగతి సాధించేలా చర్యలు చేపడుతున్నాం.

– దినేష్‌కుమార్, కమిషనర్

సీసీ కెమెరాలు



నగరంలో నిరంతరం నిఘా కొనసాగుతుంది. అన్ని ప్రాంతాలను కవర్ చేసే విధంగా సీసీ కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఏ ప్రాంతంలో ఏది జరిగినా కంట్రోల్ రూమ్ నుంచి వీక్షించే విధంగా ఆధునిక టెక్నాలజీ ఏర్పాటు చేశాం. పాలన సక్రమంగా సాగించేందుకు ఆధునిక పారిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– రవితేజ, సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ హెడ్

జగనన్న కాలనీల్లో సదుపాయాల కల్పన



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న లేఅవుట్లు, టిడ్కో గృహాల్లో సౌకర్యాలు కల్పించాలని అధికారులకు కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటీస్ సెక్రటరీలతో ఆదివారం టిడ్కో, జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వడ్డెర కాలనీ, మోరంపూడి బ్లాక్–2, సింహాచల నగర్, బొమ్మూరు 2, నామవరాల్లోని ఇళ్ల సముదాయాల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్ సదుపాయాల ఏర్పాటు వెంటనే పూర్తి చేయాలన్నారు. వెలుగుబంద, కానవరం జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా హౌసింగ్, ఎమినిటీస్ సెక్రటరీలకు లక్ష్యాలు నిర్ధయిస్తామన్నారు. నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున అందరూ అంకిత భావంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సత్యవేణి, టిడ్కో సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలో సోమవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. గాంధీపురం 4, కియా షోరూం వెనుక వీధి, శశి స్కూల్, ఎస్‌బీఐ కాలనీ, రెవెన్యూ కాలనీ ఏరియాలలో సరఫరా ఉండదన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంపీ భరత్‌కు వినతి



ఎంపీ భరత్‌రామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎంఎఫ్ఎల్ డిపో హమాలీలు

రాజమహేంద్రవరం రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఎంఎఫ్ఎల్) రాజమహేంద్రవరం డిపో హమాలీలు విన్నవించారు. వారందరూ ఆదివారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి వచ్చి భరత్ రామ్‌కు వినతి పత్రం అందజేశారు. రాజమహేంద్రవరం డిపోకి అనుబంధంగా ఉన్న 145 అవుట్ లెట్ మద్యం దుకాణాలకు గాను 46 దుకాణాలు, ఐదు బార్లను అమలాపురం ఐఎంఎఫ్ఎల్ డిపోకి కేటాయించారన్నారు. దీనివల్ల తమ పని, ఆదాయం తీవ్రంగా తగ్గిపోయిందని వాపోయారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

బొందిలి కులస్తుల సంక్షేమానికి కృషి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- ఆనం రోటరీ హాల్లో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

ప్రకాశం నగర్: బొందిలి కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. స్థానిక ఆనం రోటరీ హాల్లో ఆదివారం బొందిలి కులస్తుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ బొందిలి కులస్తుల సంక్షేమం కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అనేక చర్యలు చేపట్టారన్నారు. అందులో భాగంగా ఓసీ జనరల్ జాబితాలో ఉన్న వారిని బీసీబీ జాబితాలోకి చేర్చారన్నారు. నాడు కడియం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన రోడ్లు భవనాల శాఖ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు బొందిలి కులస్తుల సమస్యలను పలుమార్లు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, వారిని బీసీ జాబితాలోకి చేర్చడానికి ముఖ్య భూమిక పోషించారన్నారు. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని 139 బీసీ కులాలను ఒక ఏకతాటిపైకి తీసుకువచ్చి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. వాటిలో బొందిలి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు 12 మంది డైరెక్టర్లు నియమించారన్నారు. గతంలో మాదిరిగానే వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కూడా మీ అందరికీ సహాయ సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బాలాజీ శంకర్ సింగ్, ఆర్.సుజన్ సింగ్, ప్రధాన కార్యదర్శులు సాయి భాస్కర్ తివారీ, బాలాజీ సింగ్ పాల్గొన్నారు.

సమాజంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు



కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న అనీష్ కుమార్ శర్మ, మనోహరన్

రాజమహేంద్రవరం రూరల్: వ్యక్తిత్వ నిర్మాణం, ఉన్నత విలువలు పెంపొందించడంతో పాటు విస్తృతంగా సేవా కార్యక్రమాలను తమ సంస్థ సభ్యులు (మేషన్స్) చేస్తున్నారని గ్రాండ్ లాడ్జ్ ఆఫ్ ఇండియా గ్రాండ్ మాస్టర్, వర్షిపుల్ బ్రదర్ అనీష్ కుమార్ శర్మ అన్నారు. పేదలకు వైద్యం, ఉచిత విద్య అందించడంలో తమ సంస్థ విశేషంగా కృషి చేస్తోందన్నారు. కోలమూరులోని గోదావరి లాడ్జి 89 (మెసానిక్ లాడ్జి)లో కోస్టల్ లాడ్జెస్ మెంబర్లు సమావేశమయ్యారు. సందర్శించడానికి వచ్చిన అనీష్ శర్మ ఆదివారం ఉదయం విలేకరులతో మాట్లాడారు. తమ సంస్థలోని సభ్యులు కులమతాలకు అతీతంగా వ్యవహరిస్తారన్నారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లోని సూత్రాలను అనుసరిస్తూ సోదర భావంతో మెలగడం తమ సంస్థ సభ్యుల గొప్పతనమన్నారు. రీజినల్ గ్రాండ్ మాస్టర్ టీఎస్ మనోహరన్ మాట్లాడుతూ 250 ఏళ్ల క్రితం సమున్నత ఆశయాల కోసం ఆవిర్భవించిన తమ సంస్థకు సంబంధించి మన దేశంలో నార్తరన్, ఈస్టర్న్, వెస్టర్న్, సదరన్ రీజియన్లు ఉన్నాయని, వాటిలో 20 వేల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఇందులో పదివేల మంది సభ్యులు చెన్నై కేంద్రంగా గల సదరన్ రీజియన్‌లోనే ఉన్నారని, 107 లాడ్జిలు ఉన్నాయన్నారు. వచ్చే నవంబర్‌లో 250 ఏళ్ల వేడుక నిర్వహించుకోబోతోందన్నారు. తమ సంస్థలో 60 ఏళ్లు పూర్తి చేసుకున్న 15 మందిని గౌరవించుకున్నామన్నారు. ఈ సందర్భంగా పేద మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, మురళి, మద్దూరి శివ సుబ్బారావు, వి.భాస్కరరామ్, మార్గాని నాగేశ్వరరావు, ఎం.రాజబాబు, గాదె కిషోర్, ఎం.శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కడియం: కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994 – 95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పీఎస్ఎం కల్యాణ మండపంలో కలుసుకున్నారు. ఆనాటి తరగతి గదులలోను, పాఠశాలలోను పిలిచుకున్న నిక్‌నేమ్‌లతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ సంతోషంగా సందడి చేశారు. తమకు చదువు చెప్పిన సుబ్బలక్ష్మి టీచర్‌ను ఘనంగా సత్కరించారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటే నిర్వాహకులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ రీజినల్ చైర్మన్ చింతా ప్రసాదరెడ్డి అన్నారు. కేఎస్ఆర్ హాస్పిటల్స్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గోదావరి గట్టున కంభం సత్రం ఎదురుగా ఉన్న కేఎస్ఆర్ హాస్పిటల్‌లో ఆదివారం వైద్య, ఔషధ సేవాశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, చెవి, ముక్కు, గొంతు, దంత, కిడ్నీ, నరాల సంబంధ, సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. కేఎస్ఆర్ హాస్పటల్స్ కన్వీనర్ డాక్టర్ కొమ్మ శ్రీనివాసరావు మాట్లాడుతూ శిబిరంలో 250 మంది వైద్య సేవలు పొందారన్నారు. ప్రముఖ వైద్యులు, కేఎస్ఆర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మ ఉజ్వల్, కొమ్మ సుస్మిత, శశాంక్ పిల్లారిశెట్టి, సత్తి రవికాంత్, లంక వంశీ, సత్యా కిడ్నీ కేర్ వైద్యులు సేవలందించారన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ ప్రతినిధులు డీఎస్ఎన్ మూర్తి, గాంధీ, పాల కృష్ణప్రసాదరెడ్డి, మాజీ కార్పొరేటర్లు మాటూరి రంగారావు, మింది నాగేంద్ర పాల్గొన్నారు.

శ్రీరామ పాదుకలతో పాదయాత్ర

రాజానగరం: అయోధ్యలో శ్రీరామునికి పాదుకలు సమర్పించాలనే సంకల్పంతో హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస్ అయోధ్యకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం రాజానగరం మండలం చక్రద్వారబంధం చేరుకుంది. శ్రీరామునికి సమర్పించే పాదుకలను రాయవరం మండలం వెదురుపాకకు తీసుకువచ్చిన ఆయన అక్కడ ఉన్న విజయదుర్గ పీఠంలో శనివారం ప్రత్యేక పూజలు చేయించారు. ఉదయాన్నే బయుదేరి రాత్రికి చక్రద్వారబంధం చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతోపాటు కలసి వచ్చే భక్తులతో ఈ పాదయాత్రను కొనసాగిస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

మధురపూడి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని దోసకాయలపల్లిలో 2 కిలీమీటర్ల పొడవైన మురుగు నీటి కాలువ, అర కిలోమీటర్ పొడవైన రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో వీటి నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అలాగే సవర సామాజిక వర్గీయుల కోసం రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మించినట్టు తెలిపారు.

ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం

ప్రకాశం నగర్: కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణతో హర్షణీయమని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని ఏపీజేఈఎఫ్ జిల్లా శాఖ చైర్మన్ పి.వెంకటరత్నం అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఆదివారం ఏపీజేఈఎఫ్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరత్నం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వారికి ఆరాధ్యులుగా మారారన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి ఆత్మహత్య

రాజానగరం: మండలంలోని కొండగుంటూరుకు చెందిన పిట్టా అప్పన్న (67) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొనఊపిరితో ఉన్న అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చేర్పగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్సై సురేష్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. తాగుడుకు బానిసై ఇల్లు, ఒళ్లు గుల్ల చేస్తున్నావంటూ కుటుంబ సభ్యులు కోప్పడటంతో మనస్తాపానికి గురైన అప్పన్న.. మద్యంలో గడ్డి మందును కలుపుకొని శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

అప్పల బాధతో మహిళ ఆత్మహత్య

రాజానగరం: అప్పల బాధతో ఓ మహిళ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొండగుంటూరులో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై సురేష్ తెలిపిన వివరాలిలాన్నాయి. పేరూరి లక్ష్మి (45) కుటుంబ అవసరాల కోసం ఇరుగు పొరుగు వారి వద్ద రూ.80 వేల వరకూ అప్పులు చేసింది. అయితే వాటిని తీర్చకపోవడంతో అప్పు ఇచ్చిన వారంతా ఒత్తిడి చేశారు. దీంతో అప్పులు తీర్చే అవకాశం లేక ఈ నెల 7న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం కోలుకుని ఈ నెల 25న ఇంటికి తిరిగి వచ్చింది. కానీ మర్నాడే అనారోగ్యానికి గురికావడంతో మళ్లీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

పోషకాల గని.. సీతాఫలం

- ఏడీబీ రోడ్డుపై జోరుగా విక్రయాలు
- పేదోడి యాపిల్‌కు మంచి డిమాండ్



ఏడీబీ రోడ్డులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన సీతాఫలాలు

రంగంపేట: సీజనల్‌గా దొరికే సీతాఫలాలను ఇష్టపడని వారుండరు. చిన్నారుల నుంచి పెద్దల వరకూ ఇష్టంగా తినే ఈ మధుర ఫలాలకు ఎంతో డిమాండ్ ఉంది. ముఖ్యంగా మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో దొరికే సీతాఫలాలకు రుచిలో మంచి పేరుండడంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చి మరీ కొనుక్కుని తీసుకెళుతుంటారు. ప్రస్తుతం సీతాఫలాల కాపు బాగుండడంతో చిరు వ్యాపారులు ఏడీబీ రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటుచేసి విక్రయాలు జరుపుతున్నారు.

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

సీతాఫలాలను తినడం వల్ల ఎన్నో రకాల పోషక విలువలు శరీరానికి అందుతాయి. విటమిన్–ఏ, మెగ్నీషియం, ఫైబర్, విటమిన్–బీ, కాల్షియం, విటమిన్–సీ, ఐరన్ వంటి పోషక విలువలు ఉంటాయి. శరీరానికి కావలసిన శక్తి లభించి కండరాలు, నరాల బలహీనత, కంటి ఇబ్బందులు తొలగుతాయి. సీతాఫలంలో ఉండే మెగ్నీషియం వల్ల గుండె జబ్బులు నయమవుతాయి. అల్సర్లు, ఏసీడీటీ, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధమైన సమస్యలు తొలగిపోతాయి. అందుకే వీటిని పేదోడి యాపిల్ అని కూడా అంటారు.

వాహన చోదకులకు విక్రయాలు

రంగంపేట మండలంలోని కోటపాడు, రామేశంపేట, వెంకటాపురం గ్రామాల్లో సీతాఫలాల తోటలు ఎక్కువగా ఉన్నాయి. ఒక్క రంగంపేట మండలంలోనే 200 ఎకరాల్లో సీతాఫలాల తోటలున్నాయి. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో మాత్రమే సీతాఫలాలు దొరుకుతాయి. ఇక్కడ పండే సీతాఫలాలను రైతులు స్థానిక ఏడీబీ రోడ్డు పక్కన వచ్చిపోయే వాహనచోదకులకు విక్రయిస్తుంటారు. మరికొంతమంది రైతులు కాకినాడ, రాజమహేంద్రవరం మోటారు సైకిళ్లపై తీసుకెళ్లి కాయల సైజును బట్టి ధర నిర్ణయించి విక్రయిస్తారు. ప్రస్తుతం పెద్ద కాయలు డజను రూ.200 నుంచి రూ.250 వరకూ ధర పలుకుతుంది. చిన్న సైజు సీతాఫలాలు రూ.100 నుంచి రూ.150 ధరకు అమ్ముతున్నారు.

వాతావరణం అనుకూలిస్తే చాలు



వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే అధిక దిగుబడులు వస్తాయి. కాయలు తయారైనప్పుడు వర్షాలు కురవకుండా ఉంటే ఎక్కువ లాభాలు వస్తాయి. ఈ ఏడాది వారం పది రోజులు వర్షాలు ఇబ్బంది పెట్టినా మిగతా రోజుల్లో వ్యాపారం బాగా జరిగింది.

– పి.దుర్గాప్రసాద్, వ్యాపారి, వెంకటాపురం